పట్టాలకు మోక్షం ఎన్నడో?

- సర్వే జరిపి పక్కన పెట్టేసిన అధికారులు
- కొత్త ప్రభుత్వం ప్రకటన కోసం ఎదురుచూపులు
- ఇస్తారో, ఇవ్వరోనని లబ్ధిదారుల ఆందోళన
- ఇప్పటికే ఇచ్చిన పట్టాల్లోనూ తప్పులు


కొత్తగూడెంలో స్థలాల క్రమబద్ధీకరణ సర్వే చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంలో దశాబ్దాల కిందట స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న వారి ఇంటికి యాజమాన్య హక్కు కల్పించే ఉద్దేశంతో చేపట్టిన క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. గతేడాది ఎన్నికల ముందు దాదాపు 1,200 మంది నివసిస్తున్న ఇంటి స్థలాల విషయమై సర్వే చేసిన బృందాలు నివేదికలను తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించారు. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పట్టాల పంపిణీ అటకెక్కింది. సర్వే జరుగుతుండటంతో తమకు పట్టాలు అందుతాయని భావించిన వారికి నిరాశ ఎదురైంది. ఆ తర్వాతైన కొత్త ప్రభుత్వం స్థలాల క్రమబద్ధీకరణపై ఎలాంటి నిర్ణయం వెలువరించకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే ప్రభుత్వమే ప్రకటన చేయాల్సి ఉందనే సమాధానం వస్తోంది. ఇక కొందరికి మంజూరు చేసిన పట్టాల్లోనూ తప్పులు ఉండటం, ఒకరి భూమికి ఇంకొకరి పేరిట పట్టా ఇవ్వడంపై అధికారుల తీరును విమర్శిస్తున్నారు.

ప్రక్రియ సాగిందిలా..

తొలుత 2014 కటాఫ్‌గా ప్రకటించగా ఆ సమయాన్ని కొత్తగూడెంలో నివాసముంటున్న పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ, గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు 2020 వరకు కటాఫ్ తేదీ ప్రకటించడంతో మరికొందరికి అవకాశం లభించింది. మొత్తంగా 2,500 మంది వరకు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికలకు ముందు తహసీల్దార్ల బదిలీలు జరగడంతో కొత్తగా వచ్చినవారు విధుల్లో చేరగానే ఎన్నికల శిక్షణ పేరిట హైదరాబాద్ పంపించారు. ఆ తర్వాత గృహలక్ష్మి, ఇళ్లస్థలాలకు సంబంధించిన సర్వేలు జరిగినా.. చివరి దశకు చేరుకునేలోగా ఎన్నికల కోడ్ రావడంతో మొత్తం ప్రక్రియే నిలిచిపోయింది.

2008 నుంచి మొదలు..

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి వార్డుల్లో నివసించే ప్రజలు, వారి ఇళ్లకు యాజమాన్య హక్కు కల్పించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో 373 జీఓ తీసుకొచ్చారు. ఈ జీఓ ఆధారంగా పట్టణంలోని 11 వేల మంది దరఖాస్తు చేసుకుంటే అందులో 4,600 మందికి క్రమబద్ధీకరణ పట్టాలు మంజూరు చేశారు. మిగిలిన 6,400 మందికి వివిధ కారణాలతో రాలేదు. ఇక పట్టాలు అందుకున్న వారిలోనూ కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో పట్టాలకు విలువ లేకుండా పోయింది. కాగా, మిగిలిపోయిన వారి కోసం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు 76 జీఓ తీసుకురాగా, మొదటి విడతగా దరఖాస్తు చేసుకున్న 6,146 మందిలో 3,500 మందికి గతేడాది పట్టాలు వచ్చాయి. ఇంకా మిగిలిన వారి కోసం 2022 జూలైలో దరఖాస్తుకు చివరి అవకాశం ఇవ్వగా 1,531 మంది దరఖాస్తు సమర్పించారు. వారిలో 2022 నవంబర్‌లో 530 మందికి మాత్రమే పట్టాలు ఇవ్వగా.. మిగిలినవన్నీ పక్కన పెట్టేశారు. కాగా, కొందరికి ఖాళీ స్థలం ఉండి ఇళ్లు లేకపోయినా పట్టాలు మంజూరు చేశారనే ఆరోపణలు వచ్చాయి. అలాగే, కొందరు సింగరేణి క్వార్టర్లకు కూడా పట్టాలు మంజూరు చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఇంకొందరు ప్రభుత్వ స్థలంలో అప్పటికప్పుడు గదులు నిర్మించి పట్టాలు పొందారని, మరికొందరు స్థలం ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించినా పట్టాలు ఇచ్చారని సమాచారం. ఈ ఆరోపణలతో కొన్నాళ్ల కిందట రెవెన్యూ అధికారిపై బదిలీ వేటు కూడా పడింది. ఈ మేరకు మిగిలిన 1,200 మంది దరఖాస్తులను పరిశీలించి పట్టాలు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

నాయకుల అరెస్ట్ హేయం



జూలూరుపాడు: నినాదాలు చేస్తున్న నాయకులు


ఇల్లెందు: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఖమ్మం మార్కెట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులను పోలీసులు అరెస్టు చేయడం హేయమైన చర్య అని, దీనిని ఖండిస్తున్నామని రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వల్లోజి రమేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కూరాకుల నర్సింహారావు తెలిపారు. సోమవారం మండలంలోని ఎల్లుకలొడ్డు గ్రామంలో జరిగిన ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో గలిగె వెంకటేశ్వర్లు, బుర్రా నాగయ్య, భట్టు చెమరయ్య, బచ్చల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయకులను విడుదల చేయాలి..

టేకులపల్లి: ఖమ్మం మార్కెట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ (ఎంఎల్) ఎన్డీ, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి అరెస్టు చేయడం దుర్మార్గమని ఎన్డీ నేత కల్తీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం టేకులపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జోగారావు, లెనిన్, రాజు, భిక్షమయ్య, హరికృష్ణ, అజిత్, పాపారావు, మల్లయ్య పాల్గొన్నారు. కాగా, అరెస్ట్ చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

లాఠీచార్జ్ అమానుషం

ఇల్లెందు: వ్యవసాయ మార్కెట్‌లో మధ్య దళారీలు, వ్యాపారుల నిలువు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలో ఎన్డీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న నేతలను అక్రమంగా అరెస్టు చేయటం అమానుషమని ఎన్డీ అనుబంధ ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సారంగపాణి, పట్టణ నాయకులు తోడేటి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఇల్లెందులోని కొత్తబస్టాండ్ సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో ఎట్టి నర్సింహారావు, బొగ్గారపు వెంకన్న, లాలు, రాజు పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం

సుజాతనగర్: మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకొంది. ఈ భవనాన్ని 1998లో నిర్మించారు. 26 ఏళ్లు పూర్తవడంతో భవనం పెచ్చులూడి పోతోంది. ఈ కేంద్రం పరిధిలో బాలింతలు ఐదుగురు, గర్భిణులు ఐదుగురు, టీహెచ్‌ఆర్ పిల్లలు 20 మంది, 3 నుంచి ఆరేళ్ల వయసు గల చిన్నారులు 15 మంది ఉన్నారు. భవనం ఎప్పుడు కూలిపోతుందోనని వారంతా భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల భవనం పెచ్చులూడి పడినట్లు తెలుస్తోంది. భారీ ప్రమాదం చోటుచేసుకోకముందే భవనాన్ని కూల్చివేసి నూతన భవనాన్ని నిర్మించాలని చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళలు హక్కుల కోసం నిలబడాలి


మాట్లాడుతున్న బిందుశ్రీ

ఇల్లెందురూరల్: నేటి సమాజంలో మహిళలు హక్కుల కోసం నిలబడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన మహిళా సదస్సులో వారు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో లీగల్ కౌన్సిలర్ సునీత, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

ఇప్పలతండాలో జాతర ప్రారంభం


జర్పులతండాలో ఆలయం వద్ద సందడి

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం పంచాయతీ ఇప్పలతండాలో కొలువుదీరిన లింగబసవేశ్వరస్వామి జాతర సోమవారం రాత్రి ప్రారంభమైంది. పూజారులు బాణోతు శ్రీను, జర్పుల మంగమ్మ ఆధ్వర్యంలో శివ, పార్వతుల కల్యాణం జరిపించారు. పూనెం ఉమ, పూనెం సురేందర్, హట్యానాయక్, బాదావత్ వెంగళరావునాయక్, భూక్య రంగీలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దమ్మతల్లి జాతర

మండలంలోని బద్దుతండా పంచాయతీ సీతారామ గుట్టపై వెలిసిన పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళవారం నుంచి జాతర వేడుకలు జరగనున్నాయని ఆయల పూజారి భూక్య సీతారాములు సోమవారం తెలిపారు. జాతరకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో పదోన్నతులు కల్పించాలి

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగాలు, పదోన్నతులు గిరిజనులకే ఇవ్వాలని టీఎస్‌టీటీఎఫ్ మండల జనరల్ సెక్రటరీ నూనావత్ భిక్షం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఒకే దఫాలో మూడు ప్రభుత్వ కొలువులు


గోసుల సౌజన్య

జూలూరుపాడు: జూలూరుపాడు గ్రామానికి చెందిన గోసుల సౌజన్య మూడు ప్రభుత్వ కొలువులు సాధించింది. ఇటీవల టీఆర్‌ఈఐఆర్‌బీ విడుదల చేసిన ఫలితాల్లో జేఎల్, టీజీటీ, పీజీటీ సాధించింది. జూనియర్ లెక్చరర్‌గా సోమవారం నియామకపత్రం అందుకున్నట్లు సౌజన్య సోమవారం తెలిపింది.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

ఇల్లెందు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి ఇల్లెందు ఏరియాలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. సోమవారం ఇల్లెందు జీఎం కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు 8వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాయిస్వరూప్ పాల్గొన్నారు.

నేడు వినియోగదారుల సభ

కొత్తగూడెంరూరల్/టేకులపల్లి: లక్ష్మీదేవిపల్లి, బొమ్మనపల్లికి సంబంధించిన విద్యుత్ వినియోగదారులకు టేకులపల్లి సబ్‌స్టేషన్‌లో ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట వరకు సభ నిర్వహిస్తామని ఏడీ ప్రభాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు సీజీఆర్‌ఎస్ చైర్‌పర్సన్ తిరుమల్‌రావు హాజరవుతారని, వినియోగదారులు హాజరై సమస్యలు చెప్పాలని ఆయన పేర్కొన్నారు.

మాజీ మంత్రికి నివాళి

జూలూరుపాడు: మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి 8వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ పాపకొల్లు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మాళోత్ మంగీలాల్‌నాయక్, మధుసూధన్‌రావు, కృష్ణయ్య, వెంకటనారాయణ, నరసింహారావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, నవీన్, కిషన్, రాంబాబు, వంశీ, అమ్మ, వీరయ్య, ముత్తయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో నూతనంగా ఉద్యోగం సాధించిన గ్రేడ్‌-2 క్లర్కులకు ఎంవీటీసీ కార్యాలయంలో సోమవారం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేమ్‌రాజు అవగాహన సదస్సు నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్‌గా నిబద్ధతతో పని చేయాలన్నారు. కోటిరెడ్డి, శివకేశవరావు, శర్మ, చంద్రశేఖర్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా రజిని

టేకులపల్లి: మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా టేకులపల్లికి చెందిన బండ్ల రజిని నియమితులయ్యారు. సోమవారం తోట దేవీప్రసన్న, ఎమ్మెల్యే కనకయ్య నియామక పత్రం అందించారు.

మెనూ అమలు చేయాలి

టేకులపల్లి: ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ సక్రమంగా పాటించాలని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన శంభునిగూడెం, చంద్రుతండా, జి.కొత్తతండా, బిల్లుడుతండా, మద్రాస్తండాలను సందర్శించిన సందర్భంగా వ్యాఖ్యానించారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

పాల్వంచ: పేద విద్యార్థినికి సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన రత్నమాణిక బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమెకు సోమవారం రూ.10 వేలను ఎమ్మెల్యే కూనంనేని చేతుల మీదుగా అందించారు.

పోలియో చుక్కలపై ఇంటింటి సర్వే


టేకులపల్లి: ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది


పాల్వంచరూరల్: పోలియో చుక్కలు వేస్తున్న రాజు


ఇల్లెందురూరల్: సర్వే చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

టేకులపల్లి: పోలియో చుక్కలు వేసే కార్యక్రమం ఆదివారం ప్రారంభం కాగా, మిగిలిన వారికి సోమవారం నుంచి పోలియో చుక్కలు వేశారు. ఏఎన్‌ఎం, ఆశావర్కర్, అంగన్‌వాడీ టీచర్ సభ్యులుగా ఉన్న బృందాలు ఇంటింటి సర్వే చేశారు. వైద్యాధికారి కందుల దినేశ్, సీహెచ్‌ఓ వజ్జా పార్వతి, హెచ్‌ఈఓ దేవా, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, విజయ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పాల్వంచ మండలంలో..

పాల్వంచరూరల్: మండలంలోని ఉల్వనూరు పీహెచ్‌సీ పరిధిలో సోమవారం ఇంటింటి సర్వే చేపట్టి 800 మంది చిన్నారులకు, జగన్నాథపురం పీహెచ్‌సీ పరిధిలో 172 మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేశామని వైద్యులు తేజశ్రీ, రాజు తెలిపారు. కృష్ణయ్య, హెచ్‌వీ దేవమ్మ, శ్రీను పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఇంటింటి సర్వే

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజు, రజినీకాంత్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌ఓకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల వినతి


వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న డీఈఓ, జీసీడీఓలపై చర్యలు తీసుకోవాలని, కేజీబీవీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డీఆర్‌ఓ రవీంద్రనాథ్‌కు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం మాట్లాడారు. జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో ఎక్కడా నిత్యావసర వస్తువుల టెండర్లు సక్రమంగా వేయడం లేదని తెలిపారు. విద్యార్థులకు వారాల తరబడి కోడిగుడ్లు, అరటిపండ్లు అందకున్నా.. బిల్లులు మాత్రం తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా నెలకొన్న పలు సమస్యలను డీఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ప్రతినిధుల పర్యటన


మాట్లాడుతున్న నజీర్ అహ్మద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని జేకేఓసీలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు గుర్తింపు సంఘం ప్రతినిధులు ఓసీలో పర్యటించారు. సోమవారం గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు దాసరి రాజారామ్.. సమస్యలను మేనేజర్ పూర్ణచందర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. సంజీవచారి, ప్రతాప్‌కుమార్, పైడిరాజు, ప్రసాద్‌రెడ్డి, గాలిబ్ సాహెబ్, చంద్రశేఖర్, తురాయి సతీశ్‌కుమార్, ఆర్.లక్ష్మణ్‌రావు, రావూజీ, ఆంజనేయులు, ప్రభుదయాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: రాష్ట్రంలో గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తుండటంతో సోమవారం జూలూరుపాడులో సోనియాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నర్సింహారావు, ధరావత్ రాంబాబు, దుద్దుకూరి సుమంత్, పోతురాజు నాగరాజు, మిర్యాల కిరణ్‌కుమార్, మర్రి నర్సింహారావు, ఎస్‌కే మైబు, బోడా బాబూలాల్‌తో పాటు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా శ్రీధర్‌యాదవ్


నియామకపత్రం అందిస్తున్న కేవీ రంగాకిరణ్

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడిగా గొడుగు శ్రీధర్‌యాదవ్‌ను జిల్లా అధ్యక్షులు కేవీ రంగాకిరణ్ నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు అందజేశారు. గొడుగు శ్రీధర్‌యాదవ్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించారని పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తూనే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తానని తెలిపారు. చింతలచెరువు శ్రీను, శ్రీను, యాదగిరి, సాగర్, లెనిన్ పాల్గొన్నారు.

మాయావతికి కానుకగా ఇవ్వాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: మహబూబాబాద్ ఎంపీ స్థానంలో బీఎస్పీ అభ్యర్థిని గెలిపించి పార్టీ చీఫ్ మాయావతికి కానుకగా ఇవ్వాలని పార్లమెంట్ ఇన్‌చార్జ్ బానోతు రవీందర్‌నాయక్ కోరారు. సోమవారం ఇల్లెందులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అజ్మీర వెంకన్న, రాయల శ్రీనివాస్, మాలోతు సుధాకర్, ఎరుకల శ్రీను, బానోతు దీప్లా, సంతోష్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంవీఐ వెంకటరమణ


పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంవీఐ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వి.వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సెక్రటరీ షాబీర్‌పాషాతోపాటు పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొదెం వీరయ్యను కలిసిన జెడ్పీ చైర్మన్


పొదెం వీరయ్యతో జెడ్పీ చైర్మన్ కంచర్ల

చుంచుపల్లి: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను సోమవారం భద్రాచలంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మధ్యనే బీఆర్‌ఎస్ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కంచర్ల చంద్రశేఖర్‌రావు జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్యతో పలు రాజకీయ అంశాలను చర్చించారు. ఆళ్ల మురళి, దేవీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ


పరీక్ష ప్యాడ్లను అందిస్తున్న రాజమనోహర్

పాల్వంచ: లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ సెక్రటరీ మాడిశెట్టి రాజమనోహర్ పుట్టినరోజు పురస్కరించుకుని సోమవారం స్థానిక ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, స్కేళ్లు, పెన్నులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజమనోహర్ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా చదివి పదో తరగతి పరీక్షల్లో 10/10 మార్కులు సాధించినవారికి రూ.5 వేలు నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్లోబల్ సర్వీస్ స్టీల్ కన్వీనర్ ఆరుద్ర సత్యనారాయణ, అధ్యక్షులు చేపూరి బ్రహ్మచారి, హెచ్‌ఎం బుచ్చి రాములు, పుట్టా నాగేశ్వరరావు, కాట నవీన్, పాత్రు సతీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జూలూరుపాడు: మున్నూరుకాపుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే నివాసంలో కలిసి సంఘం నాయకులు సమస్యలు వివరించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బాపట్ల మురళి, రాంశెట్టి రాంబాబు, గోపు రామకృష్ణ, మల్లెల నాగేశ్వరరావు, రాంశెట్టి నాగేశ్వరరావు, ఉసికల వెంకటేశ్వర్లు, పగడాల అఖిల్, పాలెపు భద్రయ్య, పాపిన్ని వెంకయ్య, తోట శ్రీను, పాపిన్ని జనార్దన్, చౌడం నాగరాజు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ విధానం విరమించుకోవాలి

ఇల్లెందు: అంగన్‌వాడీ కేంద్రాలకు సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ అమలు విధానం విరమించుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. సోమవారం ఇల్లెందులో జరిగిన సీఐటీయూ సమావేశంలో జిల్లా సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ నబీ మాట్లాడారు. కార్యక్రమంలో ఈసం వెంకటమ్మ, తాళ్లూరి కృష్ణ, మరియ, హుస్సేన్, రాజు, ఫాతిమా, రాంబాయి, సంధ్య, కుమారీ, సుజాత, అరుణ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

6న పెన్షనర్ల దినోత్సవం

పాల్వంచ: ఈ నెల 6వ తేదీన స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో నిర్వహించే జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ బ్రహ్మారావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా కమిటీల సభ్యులు హాజరవుతారని తెలిపారు.

ఒకరికి గాయాలు

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేటతండాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. టాక్యాతండాకు చెంది భూక్యా బాలు ద్విచక్రవాహనంపై కొత్తగూడెం నుంచి ఇంటికి వస్తుండగా మాచినేనిపేతండా వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా 108లో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో అటువైపు వెళ్తున్న ఎస్‌ఐ జీవన్‌రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.